సాక్షి
సిద్దిపేట
సోమవారం । 27 । నవంబర్ । 2023



జోగిపేటలో జరిగిన సభకు హాజరైన జనం

న్యూస్‌రీల్

కొమురవెల్లిలో భక్తుల సందడి



గంగిరేణి చెట్టు ప్రాంగణంలో భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. కార్తీకమాసం కావడంతో భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. తెల్లవారుజామునుంచే స్వామిదర్శనానికి భక్తులు బారులు తీరారు. గంగిరేణి చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో బాలాజీ, ఏఈవో అంజయ్య, ప్రధానార్చకులు పర్యవేక్షించారు.

నాచగిరి.. వ్రతాలతో శోభిల్లి



నాచగిరిలో వ్రతమాచరిస్తున్న భక్తులు

వర్గల్(గజ్వేల్): కార్తీక వ్రతాలతో నాచగిరి శోభిల్లింది. పోటెత్తిన భక్తులతో కిక్కిరిసింది. కార్తీక మాసంలో సెలవురోజు ఆదివారం కలిసిరావడంతో 170 సామూహిక సత్యదేవుని వ్రతాలు జరిగాయి. 9 కల్యాణాలు జరిగాయి. 5వేలకు పైగా భక్తులు లక్ష్మీనృసింహస్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు, వ్రతమండపం ఎక్కడ చూసినా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు విడతల వారీగా దంపతులు సత్యదేవుని వ్రతాలు ఆచరించారు.

మాకు ఓటు హక్కు లేదా?

ఉద్యోగుల నిరసన



పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఎదుట ఉద్యోగులు, ఉపాధ్యాయుల నిరసన

హుస్నాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకే ఓటు హక్కు కల్పించే అవకాశం లేకపోవడం బాధాకరమని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రం వద్ద ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో భాగంగా వివిధ ప్రాంతాలకు తమను పంపించారన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఇవ్వకుండా తమ సొంత నియోజకవర్గంలోనే ఓటు హక్కును వినియోగించుకోవాలని మెస్సేజ్‌లు పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. ఓటు హక్కు వినియోగించుకోని ఉద్యోగులు ఆదివారం వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని సంబంధిత అధికారులు తెలిపారన్నారు. కేంద్రానికి వచ్చి చూస్తే ఇక్కడ అధికారులు ఎవ్వరూ లేరని ఆర్డీఓ, తహసీల్దార్లకు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు.

కాంగ్రెస్ నాయకుల ధర్నా

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించకుండా అధికార పార్టీ నాయకులు, అధికారులు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరించడం బాధాకరమని పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి అన్నారు. తక్షణం ఓటు హక్కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శులు చిత్తారి రవీందర్, ఎండీ హస్సేన్, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్యం బతకాలంటే బీఆర్‌ఎస్‌ను ఓడించాల్సిందే



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్‌రూరల్: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతకాలంటే బీఆర్‌ఎస్ ఓడాలని, రైతు బంధుకు ఈసీ అనుమతి ఇచ్చినప్పుడే బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనని ప్రజలకు అర్థమవుతోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాలకు వెళ్లిన బీఆర్‌ఎస్ నాయకులను ప్రజలు నిలదీస్తున్నారని చెప్పారు. ఆర్థికంగా ఉన్నవారికే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ వస్తే కర్ఫ్యూ వస్తుందని మాట్లాడుతున్న సీఎం.. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత నక్సలైట్ల ఎజెండాను అమలు చేస్తానని అన్నారు కదా? ఏమైందని ప్రశ్నించారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. 119 సీట్లలో బీఆర్‌ఎస్‌కు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. ప్రజలు మార్పు కోరుతూ కాంగ్రెస్‌కు మద్దతు పలుకుతున్నారని చెప్పారు.

దుబ్బాక పెట్టిన భిక్షే..



దుబ్బాక సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి

- ఈ స్థాయికి ఎదిగాను..
- ప్రాణం ఉన్నంత వరకూ ఈ గడ్డను మరువను
- ఎప్పుడైనా కత్తిపోట్లు చూశామా..
- సేవచేయాలని వస్తే చంపాలని చూస్తారా?
- ప్రభాకర్‌రెడ్డి మంచోడు.. ఆశీర్వదించండి
- ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

దుబ్బాకటౌన్: జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ.. పుట్టిన ఈ గడ్డ చరిత్రలో సజీవం.. దుబ్బాక భిక్ష తోనే నేను ఈ స్థాయికి ఎదిగి.. మీ ముందు మాట్లాడుతుండడం చాలా గర్వంగా ఉంది.. ఇక్కడే నేను హైస్కూల్ వరకు చదువుకున్నా.. నేను ఉన్నన్నీ రోజులు దుబ్బాకను మరువను అంటూ సీఎం కేసీఆర్ అన్నారు. ఆదివారం దుబ్బాక పట్టణంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు సీఎం కేసీఆర్ హాజరై ప్రసంగించారు. 'ప్రభాకర్‌రెడ్డి చాలా మంచోడు.. చీమకు కూడా హాని చేయని వ్యక్తి. సేవ చేయాలని వస్తే చంపాలని చూస్తారా?..' అంటూ సీఎం కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. దుబ్బాక చరిత్రలో ఎప్పుడైనా కత్తిపోట్లు చూశామా.. ఏం అన్యాయం చేసిండని ప్రభాకర్ రెడ్డిని చంపాలని చూసింద్రు దేవుడి దయ, మీ ఆశీర్వాదంతోనే ఆయన బతికిండని కేసీఆర్ అన్నారు.

బీజేపోడు ఏమన్నా చేసిండా..

దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి అనారోగ్యంతో మరణిస్తే ఆయన సతీమణి సుజాతను దుబ్బాక ఉప ఎన్నికల్లో దింపాం.. కాని అప్పుడు నేను ప్రచారానికి రాలే.. వస్తే వాడిచే పోయేదని సీఎం కేసీఆర్ అన్నారు. చెప్పలేని వాగ్దానాలు చేసి గెలిచిన బీజేపోడు ఏమన్నా చేసిండా గీసొంటి మోసగాడిని గుండుకొట్టి ఈ ఎన్నికల్లో పంపాలన్నారు. ప్రభాకర్‌రెడ్డి రెడు సార్లు ఎంపీగా గెలిచిండు.. ఇప్పుడు ఎంపీగా మళ్లీ గెలుస్తడు.. ఆయన టికెట్ అడగలే దుబ్బాక ఎమ్మెల్యేగా సేవలు అవసరమని నేనే టికెట్ ఇచ్చా.. ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కేసీఆర్ కోరారు.

నెలరోజుల్లోనే రెవెన్యూ డివిజన్..

ప్రభాకర్‌రెడ్డి గెలిచిన నెలరోజుల్లోనే దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ చెప్పారు. అలాగే దౌల్తాబాద్, చేగుంట మండలాల్లో డిగ్రీ కళాశాలలు, రింగ్‌రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తానన్నారు. ఇక్కడి దేవాలయాలు నాకు తెలియనివికావని, చిన్నప్పుడు రేకులకుంట మల్లన్న జాతర, కూడవెల్లి జాతరకు వెళ్లేవాడిని ఈ ఆలయాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు.

చంపాలని చూశారు..

'ఎంపీగా మచ్చలేని రాజకీయ జీవితం నాది. నన్ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేకనే నన్ను చంపాలని చూసింద్రు.. దేవుడి దయ మీ ఆశీస్సులతోనే బతికి బయటపడ్డా'నని బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ప్రజా ఆశీర్వాద సభలో కన్నీటి పర్యంతమవుతూ ఉద్వేగపూరితంగా ప్రసంగించారు. అబద్ధాలు చెప్పి గెలిచిన రఘునందన్ ఏం చేయలేదని, మూడేళ్లలో ప్రజలు ఏం కోల్పోయారో ప్రజలు గుర్తించారని, నన్ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.



దుబ్బాకలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజానీకం

ఆ మూడు పార్టీలు ఒక్కటే



మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

- బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎంల ఓటమే లక్ష్యం
- తెలంగాణకు బీఆర్‌ఎస్ ఏం చేసిందో చెప్పాలి
- కాంగ్రెస్ విజయభేరి సభలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ

వట్‌పల్లి/జోగిపేట (అందోల్): బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలు ఒక్కటేనని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. ఈ మూడు పార్టీల మధ్య రహస్య ఒప్పందం ఉందన్నారు. ఆదివారం జోగిపేటలో జరిగిన కాంగ్రెస్ విజయభేరి సభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్‌ను దెబ్బకొట్టేందుకు ఈ మూడు పార్టీలు చేతులు కలిపాయని, బీజేపీ, బీఆర్‌ఎస్ అరాచకాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, ఈ ఎన్నికల్లో వారికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తెలంగాణలో తమ పార్టీ గెలిచాక ఢిల్లీలో బీజేపీని కూడా మట్టికరిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎవరితో కలవదని, బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించడమే తమ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామన్నారు. మహిళలకు నెలకు రూ.2,500, రూ.500లకు గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, పంట పెట్టుబడికి ఎకరానికి రూ.15వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు, ఏకకాలంలో రూ.2 లక్షల రుణ మాఫీ, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్‌ను అందిస్తామన్నారు. ప్రతి మండలంలో ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌ను నిర్మించి నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని అడుగుతున్నారు.. అసలు కేసీఆర్ ఏం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని రాహుల్ కోరారు. సభలో కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహ, ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, పార్టీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, పీసీసీ ఉపాధ్యక్షుడు సురేష్ షెట్కార్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క రేషన్ కార్డూ ఇవ్వని సర్కార్

ఇస్నాపూర్ రోడ్ షోలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి



రేవంత్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న కాట శ్రీనివాస్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వని ప్రభుత్వానికి, ఏం చేయని కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేయడం అవసరమా? అని కాంగ్రెస్ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం సాయంత్రం పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొని పటాన్‌చెరు ఎమ్మెల్యే అభ్యర్థి కాట శ్రీనివాస్ గౌడ్‌కు మద్దతుగా ప్రసంగించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి వద్ద అక్రమంగా సంపాదించిన వేల కోట్ల ఆస్తులు ఉండొచ్చని.. కానీ, కాట శ్రీనివాస్ వైపు అశేష జనాధారణ ఉందన్నారు. 2014 కంటే ముందు మహిపాల్ ఆస్తులు, స్థితిగతులను పరిశీలించాలని ప్రజలకు సూచించారు. మెదక్ పార్లమెంట్‌లో 1,100 పరిశ్రమలను తీసుకొచ్చిన ఘనత ఇందిరమ్మది అన్నారు. 100 తప్పులు చేసిన మహిపాల్‌కు శిశుపాలుడు అని పేరు పెట్టాలన్నారు. డిసెంబర్ 9 తర్వాత కేసీఆర్‌కు చర్లపల్లి జైల్‌లో డబుల్ బెడ్రూం కట్టిస్తానని విమర్శించారు. ఓటుకు రూ.10 వేలు ఇస్తామంటూ దోచుకున్న సొమ్ముతో బీఆర్‌ఎస్ వాళ్లు ఇంటికి వస్తారని, వస్తే ఇచ్చింది తీసుకొని ఓటు మాత్రం హస్తం గుర్తుకు వేయాలన్నారు. మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి అంటూ కార్యకర్తల్లో జోష్ నింపారు. కార్యక్రమంలో పార్టీ మహిళా అధ్యక్షురాలు కాటా సుధారాణి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఇస్నాపూర్ సర్పంచ్ గడ్డం బాలమణి, ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, పటాన్‌చెరు పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, జిల్లా నాయకులు రాధాకృష్ణ, మదాస్ రాజశేఖర్, టీపీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ చౌరస్తాలో జరిగిన కాంగ్రెస్ రోడ్‌షోకు హాజరైన జనం

మెదక్‌ను చార్మినార్ జోన్‌లో కలుపుతాం

- నర్సాపూర్‌లో ఐటీ హబ్ ఏర్పాటు చేస్తాం
- సునీతారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి
- మంత్రి కేటీఆర్



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో సునీతారెడ్డి, మదన్‌రెడ్డి

నర్సాపూర్/నర్సాపూర్ రూరల్: మెదక్ జిల్లాను రాజన్న సిరిసిల్ల జోన్ నుంచి తీసి చార్మినార్ జోన్‌లో కలుపుతామని మున్సిపల్ శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. ఆదివారం నర్సాపూర్‌లో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి అభ్యర్థన మేరకు జిల్లాను చార్మినార్ జోన్‌లో కలుపుతామని, నర్సాపూర్‌లో ఐటీ హబ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నర్సాపూర్ నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని చెప్పారు. పోడు భూములకు పట్టాలిస్తామని, ఎవరి భూములు తీసుకోబోమని స్పష్టం చేశారు. అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పిస్తామని, ప్రతి పక్షాల చిల్లర మాటలు పట్టించుకోవద్దని కోరారు. నర్సాపూర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే మదన్‌రెడ్డితోపాటు నర్సాపూర్‌కు చెందిన పార్టీ నాయకులు దేవేందర్‌రెడ్డి, గాలి అనిల్‌కుమార్, చంద్రాగౌడ్, గోపి, మన్సూర్ తదితరులతోపాటు ప్యాక్స్ చైర్మన్లు, ఇతర నాయకులకు పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు.

మరింత అభివృద్ధి చేస్తా : సునీతారెడ్డి

బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి మాట్లాడుతూ.. నర్సాపూర్ ఇప్పటికే చాలా అభివృద్ధి చెందిందని, తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. మెదక్ జిల్లాను రాజన్న సిరిసిల్ల జోన్‌లో నుంచి తీసి చార్మినార్ జోన్‌లో కలపాలని, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, స్టేడియం ఏర్పాటు చేయాలని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని మంత్రిని కోరారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డిని మంచి మెజార్టీతో గెలిపిస్తామని చెప్పారు. ర్యాలీలో ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి, అసంఘటిత కార్మిక బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు గాలి అనిల్ కుమార్, చంద్రాగౌడ్, మన్సూర్, వెంకట్‌రెడ్డి, పబ్బ మహేశ్ గుప్తా, బబియానాయక్, రాజు యాదవ్, భిక్షపతి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి బండమీది జాతర

మూడు రోజుల పాటు ఉత్సవాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కార్తీక పౌర్ణమి ఉత్సవాలకు బండమీది సీతారాముల ఆలయం ముస్తాబైంది. మండలంలోని జంగంరెడ్డిపల్లి సమీపంలో బండపై సీతారాములు వెలవడంతో బండమీది జాతర అంటూ పిలుచుకుంటారు. కార్తీక పౌర్ణమి నుంచి మూడు రోజుల పాటు జాతర కొనసాగుతుంది. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇక్కడికి జగదేవ్‌పూర్, కొండపాక, సిద్దిపేట, ములుగు, చేర్యాల, యాద్రాది జిల్లా రాజపేట, తుర్కపల్లి మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.



సీతారాముల ఆలయం

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్
- కలెక్టరేట్‌లో సిబ్బందికి ఒక రోజు శిక్షణ



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: ఎన్నికల నేపథ్యంలో పొన్నాల ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ తెలిపారు. సూపర్ వైజర్, అసిస్టెంట్ సూపర్ వైజర్లకు కలెక్టరేట్‌లో ఆదివారం ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందూరు కళాశాలలోనే జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. సిద్దిపేట నియోజకవర్గానికి డి బ్లాక్ ను, హుస్నాబాద్‌కు సి బ్లాక్, గజ్వేల్‌కు ఈ బ్లాక్, దుబ్బాకకు ఏ బ్లాక్‌లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అధికారులకు అందజేసిన పీపీటీని క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలన్నారు. కౌంటింగ్ సెంటర్లలో కంట్రోల్ యూనిట్ మిషన్లను ఫలితాలు వచ్చే వరకు ప్రతిదీ పొలిటికల్ పార్టీ సభ్యులకు చూపించాలన్నారు. ఎలాంటి సమస్య ఎదురైనా ఆర్వోను సంప్రదించాలన్నారు.

కౌంటింగ్ కేంద్రాలను పర్యవేక్షించాలి..

కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సెక్టర్ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ప్రతి సెక్టార్ అధికారికి కేటాయించిన సదుపాయాలను రెండు రోజుల ముందే పర్యవేక్షించాలన్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఈవీఎం మేషిన్లను ఆయా మార్గాల గుండా ఇందూరు కళాశాలలోని స్ట్రాంగ్ రూంకు చేర్చే పూర్తి బాధ్యత సెక్టార్ అధికారులదేనన్నారు. కార్యక్రమంలో దుబ్బాక, హుస్నాబాద్ ఆర్వోలు గరిమా అగర్వాల్, బెన్ షాలం, ఎలక్షన్ సూపరిండెంట్ రామేశ్వర్, కలెక్టరేట్ ఎఓ అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కలుపుకోవాలి...

మద్యం సరఫరాపై నిఘా

ఎన్నికల వేళ మద్యం అక్రమ సరఫరా కట్టడికి చర్యలు చేపట్టాలని ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు బాలకిషన్ ఎన్నికల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్‌పాటిల్, వ్యయ పరిశీలకులు, రిటర్నింగ్, కమర్షియల్, ఎక్సైజ్ అధికారులతో ఎలక్షన్ స్పెషల్ వ్యయ పరిశీలకులు బాలకిషన్ సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన, మద్యం, నగదు, విలువైన వస్తువుల సీజ్ వివరాలను తెలిపారు.

సంక్షేమ పథకాలు మీ అయ్య జాగీరా?

- 24 గంటలు కరెంట్ ఇస్తున్నట్లు నిరూపిస్తే తప్పుకుంటా
- ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఈటల సవాల్
- గజ్వేల్‌లో కాషాయ జెండా ఎగరడం ఖాయం
- తూప్రాన్‌లో సకల జనుల విజయ సంకల్ప సభ



తూప్రాన్ విజయ సంకల్ప సభలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

తూప్రాన్: బీజేపీ కండువా కప్పుకున్న వారికి సంక్షేమ పథకాలు రావని ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు బెదిరింపులకు పాల్పడుతున్నారని, పథకాలు మీ అయ్య జాగీరా? అని గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. ఆదివారం తూప్రాన్‌లో బీజేపీ సకల జనుల విజయ సంకల్ప సభ నిర్వహించారు. బీజేపీ దుబ్బాక అభ్యర్థి రఘునందన్‌రావు అధ్యక్షతన జరిగిన సభకు ప్రధాని నరేంద్రమోదీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈటల మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లాలో అత్యధికంగా బీజేపీ అభ్యర్థులు గెలుపొందడం ఖాయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీకి వస్తున్న ఆదరణ చూసి కాషాయ కండువా కప్పుకున్న వారికి పెన్షన్లు, రైతుబంధు, డబుల్ బెడ్రూం రాదంటున్నారు. మిస్టర్ సీఎం కేసీఆర్.. మిస్టర్ హరీశ్.. మీరు ఇచ్చే సంక్షేమ పథకాలు మీ అయ్య జాగీరా..? అని ప్రశ్నించారు. మీరు కేవలం ప్రజల ఆస్తులకు కాపాలదారులు మాత్రమే అన్నారు. తెలంగాణ ప్రజానీకానికి సేవ చేసే జీతగాళ్లు అనే విషయం మరిచిపోతున్నారని తీవ్ర స్థాయిలో దుయ్యబట్టారు.

రాజకీయం నుంచి తప్పుకుంటా..

కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ తమతోనే ఉద్యోగాలు, 24 గంటల విద్యుత్ సరఫరా అని మాట్లాడటం సిగ్గుచేటని ఈటల పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా అందిస్తే తాను రాజకీయల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. రాష్ట్రంలో కౌలు రైతు చనిపోతే రూ.లక్ష ఇచ్చే సోయి లేని కేసీఆర్.. పక్క రాష్ట్రాలు పంజాబ్, హర్యానాలో రైతులకు రూ.3 లక్షల చెక్కులు అందించి తెలంగాణ వ్యవసాయంలో ఆదర్శం అని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు విత్తనాలు, ట్రాక్టర్లు, పనిముట్లు తదితర వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తామని తెలిపారు. అలాగే ప్రతీ ఇంట్లో భార్యాభర్తలు ఇద్దరికీ పెన్షన్లు అందించడంతోపాటు రైతులు సాగు చేసిన ధాన్యానికి క్వింటాల్‌కు రూ.3,500 చెల్లిస్తామని స్పష్టం చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు జిల్లాలోని బీజేపీ అభ్యర్థులు మురళీయాదవ్(నర్సాపూర్), నందీశ్వర్‌గౌడ్(పటాన్‌చెరు), రాజు (సంగారెడ్డి), శ్రీకాంత్‌రెడ్డి (సిద్దిపేట), విజయ్‌కుమార్ (మెదక్) మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు తాళ్లపల్లి రాజశేఖర్, నందారెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్, పక్కన కొత్త ప్రభాకర్‌రెడ్డి, మంత్రి హరీశ్‌రావు



సభకు హాజరైన నాయకులు

ప్రచార హోరు

పోలింగ్ తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ దూకుడు పెంచింది. అభ్యర్థుల తరపున సీఎం కేసీఆర్ అలుపు లేకుండా ప్రచారం చేస్తున్నారు. ఆదివారం దుబ్బాకలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సభకు జనం భారీగా తరలివచ్చారు.



ఎదనిండా అభిమానం



కేసీఆర్ చెయ్యికి దట్టీ కడుతున్న నాయకులు



వినతులు అందిస్తున్న మహిళా నాయకురాళ్లు



జ్ఞాపికను అందిస్తూ..

కాళేశ్వరంతో తీరిన నీటి గోస



వర్గల్ మండలం వేలూరులో ప్రసంగిస్తున్న ప్రతాప్‌రెడ్డి

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): కాళేశ్వరం జలాలతో తాగు, సాగు నీటి గోస తీర్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. నాడు సమస్యల గజ్వేల్‌ను.. సీఎం కేసీఆర్ నేడు అభివృద్ధికి మోడల్‌గా తీర్చి దిద్దారని తెలిపారు. ఆదివారం ఆయన గజ్వేల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కేసీఆర్‌కు మద్దతుగా మజీద్‌పల్లి, దండుపల్లి, నాచారం, అనంతగిరి పల్లి, వేలూరు, సీతారాంపల్లి, అంబర్‌పేట, మీనాజీ పేట, తున్కిమక్త, గౌరారం, సింగాయపల్లి, అవుసులోనిపల్లి తదితర గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. అభివృద్ధిలో దూసుకుపోతున్న గజ్వేల్ నుంచి ముచ్చటగా మూడోసారి భారీ మెజారిటీతో కేసీఆర్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని, బీజేపీ మాయమాటలు నమ్మొద్దన్నారు. గతంలో తాగునీళ్ల కోసం బిందెలతో రోడ్డెక్కిన రోజులు, అర్ధరాత్రి కరెంటుతో రైతుల సాగునీటి తిప్పలు, ఎరువుల బస్తాల కోసం పడరాని పాట్లు మరచిపోవద్దన్నారు. నేడు ఆ బాధలు పోగొట్టి నిరంతర విద్యుత్, గోదావరి నీళ్లతో భూములను సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు, ఎంపీపీ లతారమేష్‌గౌడ్, జెడ్పీటీసీ బాలూయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, బాల్‌రెడ్డి, సంతోష వెంకటేష్, జాలిగామ వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.



అనంతగిరిపల్లి రోడ్ షోలో పాల్గొన్న జనం

దుబ్బాకకు ఏం చేశారో చెప్పాలి?

- ప్రజల కోసం ఎంతవరకైనా పోరాడుతా
- దుబ్బాక బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: 'దుబ్బాకలోనే పుట్టిపెరిగా.. విద్యాబుద్ధులు నేర్పిన దుబ్బాక అంటే నాకు చాలా ప్రేమ అని' దుబ్బాక సభలో మాట్లాడిన సీఎం కేసీఆర్.. మరి ఇంతకాలం ఎందుకు అభివృద్ధి చేయలేదని బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు ప్రశ్నించారు. గజ్వేల్, సిద్దిపేటలను అభివృద్ధి చేసిన కేసీఆర్... మరి దుబ్బాకను ఎందుకు విస్మరించారని నిలదీశారు. ఆదివారం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరారు. అలాగే పలు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దుబ్బాక సభలో కేసీఆర్ మాట్లాడినవన్నీ అబద్ధాలే అన్నారు. దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఇప్పటి వరకు ఎందుకు చేయలేదని, ఇప్పుడు బీఆర్‌ఎస్ గెలిస్తే నెలరోజుల్లో చేస్తానని చెప్పడం చూస్తుంటే ఈ ప్రాంతం పట్ల ఎంతటి వివక్ష ఉందో స్పష్టం అవుతుందన్నారు. సిద్దిపేటలో కోమటిచెరువుకు పెట్టిన నిధుల్లో కనీసం సగమన్నా దుబ్బాకకు ఇచ్చారా అని ప్రశ్నించారు. సిద్దిపేట, దుబ్బాక రెండు కళ్లు అని మాట్లాడిన హరీశ్‌రావు మాటల మందమే తప్ప.. దుబ్బాకపై ఏ మాత్రం ప్రేమ లేదన్నారు. నియోజకవర్గంలో హరీశ్ ఎన్ని సార్లు తిరిగినా.. మరిన్ని కొత్త డ్రామాలు చేసినా ప్రజలు నమ్మొద్దన్నారు. కల్లబొల్లి మాటలను ఇప్పటికే ఉప ఎన్నికల్లో చైతన్యవంతులైన దుబ్బాక ప్రజలు తిప్పిగొట్టారన్నారు. హరీశ్‌కు ఏమైనా ఉంటే సిద్దిపేటలో చూసుకోవాలని.. పక్క నియోజకవర్గంపై పెత్తనం ఏమిటని ప్రశ్నించారు.

అభివృద్ధి అంటే సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లనేనా..?

అభివృద్ధి అంటే కేవలం సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లలేనా.. మిగతా నియోజకవర్గాలను ఎందుకు పట్టించుకోలేదో సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని రఘునందన్‌రావు సవాల్ విసిరారు. కేసీఆర్ తన కొడుకు , అల్లుడు ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గాలకే వేలాది కోట్లు ఖర్చు పెట్టారని, అవసరం లేని పనులకు సైతం పెద్ద ఎత్తున నిధుల పెట్టి ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఈ అవినీతి దగాకోరు కుటుంబపాలనకు ప్రజలు చరమగీతం పాడాలన్నారు.
రెండు సార్లు ఎంపీగా ఉన్న ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేసిండో ప్రజలు ఆలోచించాలన్నారు. ఏనాడైనా ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకున్నాడా...? కేవలం గజ్వేల్, సిద్దిపేట నియోజకవర్గాలకే తన నిధులు ఇచ్చి దుబ్బాకకు అన్యాయం చేశాడని తెలిపారు. ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిస్తే ఏం అభివృద్ధి చేస్తాడో ప్రజలు ఆలోచించాలన్నారు. దుబ్బాక అభివృద్ధిపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తే పెండింగ్ పనులకు నిధులు మంజూరి చేసిందన్నారు. తాను ఎవరికీ భయపడనని.. తప్పు చేసిన వాడిని విడిచిపెట్టనని ప్రజల కోసం ప్రాణాలు ఇచ్చేందుకు వెనుకాడనన్నారు.

దుబ్బాకను రాష్ట్రంలోనే నంబర్‌వన్ చేస్తా..

దుబ్బాకను రాష్ట్రంలోనే అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా అభివృద్ధి చేస్తానని రఘునందన్‌రావు ప్రజలకు భరోసానిచ్చారు. ఇప్పటికే నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో రోడ్లు, పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న వంద పడకల ఆస్పత్రి, ఐటీఐ కళాశాల భవనం, ఐఓసీ భవనం, దుబ్బాక కొత్త బస్టాండ్‌తో పాటు అనేక పనుల కోసం ప్రభుత్వంతో కొట్లాడి నిధులు మంజూరు చేయించానని చెప్పారు. మరోసారి గెలిపిస్తే ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు.

మరోమారు అవకాశమిస్తే మరింత అభివృద్ధి

రాయపోలు(దుబ్బాక): తనకు మరోమారు అవకాశమిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం తిమ్మక్కపల్లి, అనాజీపూర్‌లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూంల నిర్మాణం ఎక్కడా పూర్తి చేయలేదని, పూర్తయిన చోట పంపిణీ చేయలేదన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, మళ్లీ అధికారంలోకి వస్తే సన్నబియ్యం ఇస్తామని మభ్యపెడుతున్నారన్నారు. ఐదేళ్ల పాటు రుణమాఫీ చేయలేదని, ఎన్నికలు సమీపిస్తేనే హామీలు గుర్తుకొస్తాయా అని విమర్శించారు. ఉన్న నిధులన్నీ సిద్దిపేట, సిరిసిల్లకు తీసుకుపోయి దుబ్బాక నియోజకవర్గాన్ని వెనుకబాటుకు గురిచేసిన కేటీఆర్, హరీశ్‌లకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, మంకిడి స్వామి, రాంచంద్రం, రాయపోలు మాజీసర్పంచ్ స్వామి, నీల స్వామి తదితరులున్నారు.



అనాజీపూర్‌లో అభివాదం చేస్తున్న మాధవనేని రఘునందన్‌రావు



ఇంటింటా ప్రచారం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

దుబ్బాకరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో రఘునందన్‌రావుకు మద్దతుగా బీజేపీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు. యాదగిరి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సభ హైలెట్స్

- సీఎం సాయంత్రం 4.50గంటలకు హెలికాప్టర్‌లో సభ వద్దకు వచ్చారు.
- 5 గంటలకు ప్రత్యేక బస్సులో సభా వేదిక వద్దకు చేరుకున్నారు.
- 5.17 నిమిషాలకు ప్రసంగం ప్రారంభించిన సీఎం.. 30 నిమిషాల పాటు మాట్లాడారు.
- దుబ్బాకలోనే చదివిన తనకు.. ఈ గడ్డ పౌరుషం ఏంటో తెలుసన్నారు.
- ఈ గడ్డ బిక్షతోనే సీఎం అయ్యానని చెప్పారు.
- మంత్రి హరీశ్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఉద్వేగంగా ప్రసంగించారు.
- దేవుడి దయ, మీ ఆశీస్సులతోనే బతికి మీ ముందుకువచ్చానంటు ప్రభాకర్‌రెడ్డి కన్నీటి పర్యంతమయ్యారు.
- సభ పరిసరాల్లో సుమారు గంటన్నరకు పైగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

– దుబ్బాక టౌన్

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

నా జీవితం తెల్లని కాగితం

- అక్రమం లేదు.. కష్టపడి సంపాదించుకున్నా
- ఉమ్మడి జిల్లాలో తొలి ఉద్యమకారుడిని..
- గెలిపిస్తే వేతనం పేద విద్యార్థుల చదువులకు వెచ్చిస్తా..
- ముత్తిరెడ్డిపై 'పల్లా' చేసిన ఆరోపణలు నిరూపించాలి
- 'సాక్షి' తో కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



జనగామ: 'నీతి, నిజాయితీ, విలువలతో కూడిన జీవితా న్ని అలవాటు చేసు న్నా.. ఒక్క రూపా యి కూడా అక్రమం లేదు.. కష్టపడి సంపాదించుకున్నా.. నా ఇన్నేళ్ల రాజకీయ జీవితం ఓ తెల్లని కాగితం'.. అని కాంగ్రెస్ పార్టీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గెలిపిస్తే అర్హులందరికీ సంక్షేమ ఫలాలు, ఆరు గ్యారంటీ పథకాలు అందిస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంట ర్వ్యూ వివరాలు ఆయన మాటల్లోనే..

వేతనం పేద విద్యార్థులకు..

ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత ప్రతి నెలా వచ్చే వేతనం పేద విద్యార్థులు, ఇతర సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తాను. నాడు నియోజకవర్గాల పునర్విభజనలో చేర్యాల కనుమరుగు కావడానికి కేసీఆర్, వినోద్‌కుమార్, పొన్నాల లక్ష్మయ్య పన్నిన కుట్రలే కారణం. ఇక్కడ కొమ్మూరిని అడ్డు తొలగించుకోవడం కోసం ఈ ప్రాంతానికి అన్యాయం చేశారు.

ఉమ్మడి వరంగల్‌లో తెలంగాణ తొలి ఉద్యమ కారుడిని. స్వరాష్ట్రం కోసం సాగిన పోరులో అన్ని వర్గాల ప్రజలకు వెన్నంటి ఉంటూ తన వంతు సహకారం అందించాను. జనగామ జిల్లా కోసం కొట్లాడిన జనంతో కలిసి నడిచాను. రెండు ఉద్యమాల సమయాల్లో తనపై కేసులు నమోదయ్యా యి. పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నాను. 2004 సంవత్సరం జరిగిన ఎన్నికల్లో చేర్యాల ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు నాటి ముఖ్యమంత్రి వైఎస్సార్ చలవతో రూ.వెయ్యి కోట్లు వెచ్చించి తపాస్‌పల్లితోపాటు అనేక రిజర్వాయర్లు నిర్మాణం చేపట్టిన. ఈ రోజు వ్యవసాయం పండుగలా ఉందంటే కేవలం నాటి కృషి ఫలితమే. అయితే ఇటీవల చేర్యా ల సభలో సీఎం కేసీఆర్ కాళేశ్వరం నుంచి సాగునీరు ఇస్తున్నట్లు చెప్పడం సిగ్గుచేటు. తపాస్‌పల్లికి దేవాదుల ద్వారా వచ్చే నీరే పారిస్తున్నారు.

ఎనిమిదేళ్లలో 'పల్లా' చేసిందేంటి?

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎనిమిదేళ్లుగా ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదు. ఒక్క నిరుద్యోగికి కూడా ఉద్యోగం ఇప్పించలేదు. జనగామ, చేర్యాల మున్సిపల్, గ్రామాలు, మండలాల్లో కనీసం తారురోడ్లు వేయించలేదు. ఈ ప్రాంతానికి తన నిధుల నుంచి అభివృద్ధి ఎందు కు చేయలేదో చెప్పాలి. జనగామ బతుకమ్మకుంట, చేర్యాల పెద్దచెరువుతో పాటు అనేక ప్రాంతా ల్లో జరిగిన కబ్జాలపై ప్రజలు ఆందోళన చేస్తే ఎందుకు పట్టించుకోలేదు. ఎమ్మెల్సీ పదవి ఇంకా నాలుగేళ్లు ఉన్నా.. ఎమ్మెల్యేగా ఎందుకు పోటీ చేస్తున్నాడో ప్రజలకు చెప్పాలి. పల్లాపై అనేక భూకబ్జా ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి జనగామ చౌరస్తాలో రాజేశ్వర్‌రెడ్డిపై చేసిన ఆరోణలతో ఏకీభవిస్తున్నాను. దానిని ప్రజలు నమ్ముతున్నా రు. అబద్ధమని నిరూపించుకోవాలి. హనుమకొండ జిల్లాకు చెందిన పల్లా.. ప్రస్తుతం జూబ్లీహిల్స్‌లో ఉంటూ స్థానికుడిగా ప్రచా రం చేసుకుంటున్నారు. స్థానికత విషయంలో నాకు మాత్రమే హక్కుంది. చేర్యాల, జనగామలో సొంత ఇళ్లు ఉన్నాయి. ఎమ్మెల్యేగా సొంత ఖర్చుతో 14 ఎకరాల స్థలం ఇచ్చి ప్రభుత్వ విద్యాసంస్థలను నెలకొలి పాను. ఈ ప్రాంత ప్రజల ఆశీర్వాదం తనవైపే ఉంటుంది.

చేర్యాల గోసకు కారణం ఎవరు..?

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం చేర్యాల ప్రజలు ఇన్ని రోజులుగా పోరాటం చేస్తుంటే.. పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎందుకు పట్టించుకోలేదు. తన కుమారులు భూకబ్జాలకు పాల్పడ్డారని ఆరోపణలు చేశా రు. దీనిపై చర్చకు సిద్ధంగా ఉన్నాను. దమ్ముంటే ఆరోపణలు చేసిన వారు చర్చకు రావాలి. గత సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా వేలాది ఎకరాల్లో పంటలు నష్టపోతే ఎకరాకు రూ.10వేల పరిహారం ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్.. నేటికీ పైసా ఇవ్వలేదు. రైతుబంధు రాష్ట్ర అధ్యక్షుడిగా రాజేశ్వర్‌రెడ్డి ఎందుకు చొరవ చూపలేదు. రాష్ట్రంలో బెల్ట్ దుకాణాలను బార్లా తెరిచి తాగుబోతుల తెలంగాణగా మార్చారు. హైదరాబాద్‌లోని పల్లా ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అంటూ ప్రజలను మభ్య పెడుతున్నారు. జనగామ పట్టణంలో శుద్ధిచేసిన తాగునీటిని అందించలేక పోయారు. డ్రెయినేజీల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఎమ్మెల్యేగా గెలవగానే జనగామ, చేర్యాల పట్టణాలను అభివృద్ధి చేయడంతోపాటు కుల మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తాను.

అవ్వా.. నీకు ఆపన్న 'హస్తం' అవుతాం



వృద్ధురాలితో కాంగ్రెస్ మహిళ నాయకులు



చేగుంటలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక: కాంగ్రెస్ నాయకుల ప్రచారం జోరందుకుంది. దుబ్బాక అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ఆదివారం పట్టణంలోని 18వ వార్డులో పార్టీ నాయకులు ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వృద్ధురాలి దగ్గరికెళ్లి పార్టీ గెలిస్తే వృద్ధులకు ఆపన్న హస్తంగా ఉంటుందని చెప్పారు. చేయి గుర్తుకు ఓటు వేసి శ్రీనివాస్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు సరస్వతీ, మమత, భరత్ ఉన్నారు.

ఆపార్టీల మాటలు నమ్మొద్దు

దుబ్బాకటౌన్: బీఆర్‌ఎస్, బీజేపీల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని కాంగ్రెస్‌కు ఓట్లేసి గెలిపిస్తే ఇందిరమ్మ రాజ్యం వస్తుందని దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గంలో జరిగిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఈ నియోజకవర్గంలో తన తన తండ్రి చెరుకు ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధే తప్ప ఇంకేమీ అభివృద్ధి జరగలేదన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్ రెడ్డి

పదేళ్లయినా.. డిగ్రీ కళాశాల ఎందుకు రాలేదు

చేగుంట: బీఆర్‌ఎస్ దుబ్బాక అభ్యర్థి, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి పదేళ్లుగా అధికారంలో ఉండి కూడా చేగుంటకు డిగ్రీ కళాశాల ఎందుకు మంజూరు చేయించలేదని కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన చేగుంట గాంధీ చౌరస్తాలో ఆదివారం రాత్రి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. చేగుంటకు మోడల్ పాఠశాల, మార్కెట్ కమిటీ, జూనియర్ కళాశాల మంజూరు చేయించింది తన తండ్రి, దివంగత మాజీ ఎమ్మెల్యే ముత్యంరెడ్డి మాత్రమే అన్నారు.

కేసీఆర్ రైతు పక్షపాతి

రైతు బంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దేవి రవీందర్

కొండపాక(గజ్వేల్): బీఆర్‌ఎస్ రైతుల పక్షపాతి అని రైతు బంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండలంలోని మంగోల్, మాత్‌పల్లి గ్రామాల్లో సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారి ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ఎస్‌కు మద్దతుగా ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. రైతులు కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయమంటూ కేంద్ర ప్రభుత్వం కరాఖండీగా చెబుతోందన్నారు. కానీ రైతు కష్టాలు తెలిసిన కేసీఆర్ ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ పంటకు మద్దతు ధరను చెల్లిస్తూ కొనుగోలు చేస్తుందన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు.వ్యవసాయానికి 3 గంటల కరెంట సరిపోతుందంటూ కాంగ్రెస్ మాట్లాడుతున్న విషయాన్ని గమనించాలన్నారు. మూడోమారు కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్‌ను ఆశీర్వదిస్తే ప్రజలు మరింత బాగుపడతారని కోరారు.

కాంగ్రెస్, బీజేపీల ఝూటా మాటలు నమ్మొద్దు

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్, బీజేపీల ఝూటామాటలు నమ్మి మోసపోవద్దని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రమైన కొండపాక, క్రాంతి నగర్‌లో సీఎం కేసీఆర్‌కు మద్దతుగా ఆదివారం ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యార్యంటీలంటూ కాంగ్రెస్, డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి అంటూ బీజేపీలు గ్రామాల్లో కొత్తబిచ్చగాళ్లు పొద్దెరుగని తీరుగా తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల అవసరాలకనుగుణంగా సీఎం ఆలోచన చేస్తూ సంక్షేమ పథకాలను ప్రారంభిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టి మాధురిరెడ్డి, మాజీ ఎంపీపీ బొద్దుల కనకయ్య, సింగాటం రాములు, రామక్రిష్టారెడ్డి, మహిపాల్, లక్ష్మారెడ్డి, మంచాల కనకరాంలు, కనకయ్య, బోదాస్ స్వామి, యాదగిరి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



కొండపాకలో ప్రచారం చేస్తున్న దేవేందర్‌రెడ్డి

కేసీఆర్‌కు న్యాయవాదుల మద్దతు

గజ్వేల్‌రూరల్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పలువురు న్యాయవాదులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో కేసీఆర్‌కు మద్దతుగా ప్రచారం చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ లీగల్‌సెల్ కార్యదర్శి, న్యాయవాది కొట్టాల యాదగిరి మాట్లాడుతూ గజ్వేల్ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో ఈ ప్రాంతాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపారని గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టి దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా నిలిపారని పేర్కొన్నారు. రూ. 100 కోట్లతో న్యాయవాదుల కోసం వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేయడమే కాకుండా కరోనా సంక్షోభంలో జూనియర్ న్యాయవాదులను అన్ని రకాలుగా ఆదుకున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు అశోక్‌రెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.



గజ్వేల్: కేసీఆర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న న్యాయవాదులు